సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 17 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.



'సెంట్రల్'లో సరికొత్త కోర్సులు

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో సరికొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. 8లో

గరిష్టం/కనిష్టం
33.5°/21.9°

జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అన్నదాత సుఖీభవలో అర్హుల కుదింపు

- జిల్లాలో అర్హులు 2,58,561 మంది
- తగ్గిన రైతుల సంఖ్య 16,770



రైతుల నుంచి వేలి ముద్రలు సేకరిస్తున్న పెడపల్లి ఆర్‌ఎస్‌కే సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హుల సంఖ్య తగ్గడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 రైతుల ఖాతాలకు జమయ్యింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవ ద్వారా ఏటా రూ.20వేల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి.. మొదటి ఏడాదిలోనే మొండి చేయి చూపింది. ప్రస్తుత రెండో ఏడాదిలో పథకం అమలుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాను వ్యవసాయ కార్యాలయానికి పంపారు. అయితే అందులో చాలా మంది పేర్లు కనిపించలేదు. గత ప్రభుత్వంలో జిల్లాలో 2,75,331 మంది రైతులు వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ కింద లబ్ధి పొందారు. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ పథకం కింద 2,58,561 మందిని అర్హులుగా తేల్చారు. గత ఏడాదితో పోలిస్తే 16,770 మంది రైతులు తగ్గిపోయారు. ఇక కొత్తగా భూములు కొన్న వారు, ఈ-కేవైసీ చేయించని వారికి అన్నదాత సుఖీభవ అందకపోవచ్చు. వారం రోజుల నుంచి రైతు సేవ కేంద్రాల్లో రైతుల వేలిముద్రలు తీసుకుంటున్నారు. ఇవన్నీ రెండో జాబితాలో రావచ్చని డీఏఓ సుబ్బారావు పేర్కొన్నారు.

అర్జీలు వేగంగా పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ 242 అర్జీలు స్వీకరించారు. ఇందులో ఎక్కువగా పింఛన్, పక్కాగృహాలు, ఇంటి పట్టాలు, భూ సమస్యలు తదితర వాటికి సంబంధించి అర్జీలు వచ్చాయి. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్దేశిత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ సమస్యలు లేకుండా అధికారులు జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయ సారథి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కోసం వినూత్న నిరసన



వంటా వార్పుతో వడ్డి వెంకటలక్ష్మమ్మ నిరసన

గోరంట్ల : కబ్జాకు గురైన ఇంటి స్థలం విషయంలో రెవెన్యూ అధికారులు న్యాయం చేయలేదని ఓ వృద్ధురాలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేసింది. రాగిమాకులపల్లికి చెందిన వడ్డి వెంకటలక్ష్ముకు గౌనివారిపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబరు 180-2లో కొన్నేళ్ల కిందట మూడు సెంట్ల నివేశన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అయితే ఆమె అందులో ఇంటి నిర్మాణం చేపట్టలేదు. ఈ క్రమంలో ఆ స్థలంలో నాగులకట్ట వెలిసింది. మిగిలిన స్థలం వేరొక వ్యక్తి ఆధీనంలో ఉంది. అందులోకి ఆమెను రాకుండా అడ్డుకుంటున్నారు. తనకు కేటాయించిన స్థలానికి హద్దులు చూపించాలంటూ వడ్డి వెంకటలక్ష్మమ్మ గత కొంతకాలంగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. అయితే అధికారులు సమస్య పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తుండటంతో సోమవారం వంటసామగ్రితో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడే వంటావార్పు చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించింది. ఈ విషయమై తహసీల్దార్ మారుతిని వివరణ కోరగా.. బాధితురాలికి తొలుత కేటాయించిన స్థలంలో నాగుల కట్ట.. మిగిలిన స్థలం రోడ్డు అవసరాల కోసం వినియోగించుకుంటున్నారని చెప్పారు. ఆమెకు మరొక చోట ఇంటి స్థలం ఇస్తామంటే ఒప్పుకోవడం లేదని తెలిపారు.

ఆడబిడ్డలకు అన్యాయం

'కూటమి ప్రభుత్వం రాగానే 'ఆడబిడ్డ నిధి' కింద 18 ఏళ్లు నిండి 60 ఏళ్ల లోపు ఉన్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఏటా రూ.18 వేలు అందజేస్తాం' అని చంద్రబాబు చెప్పిన మాటలను మహిళలు నమ్మారు. అలా నమ్మిన వారిలో చిలమత్తూరు మండల కేంద్రానికి చెందిన రమణమ్మ కూడా ఒకరు. ప్రతి నెలా వచ్చే రూ.1,500తో పొదుపు చేసుకోవచ్చని గ్రామంలో ఓ వ్యక్తి దగ్గర రూ.50వేలు విలువ చేసే చీటీ (చిట్) వేసింది. అయితే ఇంటి అవసరాల కోసం మొదటి మాసంలోనే చిట్ ఎత్తుకుంది. ఏడాది పూర్తయినా ఆడబిడ్డ నిధి కింద పైసా కూడా రాలేదు. దీంతో కంతుల చెల్లింపు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.



ఏదీ.. ఆడబిడ్డ నిధి?

- నీకు 18 వేలు.. నీకు 18 వేలు.. ఉత్తిదే
- బాబు ష్యూరిటీ.. భవిష్యత్ మోసం గ్యారంటీ
- కూటమి సర్కారుపై మహిళల ఆగ్రహం

కదిరి: సార్వత్రిక ఎన్నికలు (2024) సమయంలో చంద్రబాబుతో సహా టీడీపీ నాయకులు మహిళలు కనిపించగానే 'మాకు ఓటు వేసి గెలిపిస్తే నీకు రూ.18 వేలు.. నీకు రూ.18 వేలు ప్రతి ఏటా ఇస్తాం' అంటూ ఆశపెట్టి.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీ అమలు చేయకుండా నిలువునా మోసం చేశారు. 2014 ఎన్నికల సమయంలో కూడా ఇలాగే 'మహిళలు బ్యాంకులో తాకట్టు పెట్టిన నగలు ఇంటికి రావాలంటే బాబు అధికారంలోకి రావాలి' అని చెప్పి.. అధికారంలోకి రాగానే ఆ హామీని విస్మరించి వంచించారు. డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారు. ప్రస్తుత ఏడాది పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చేశామని చంద్రబాబుతో సహా కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.

జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు లబ్ధి ఇలా..

పథకం	మహిళల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా (రూరల్)	23,365	721.63
వైఎస్సార్ సున్నావడ్డీ (రూరల్)	30,957	195.25
వైఎస్సార్ చేయూత (రూరల్)	1,22,826	810.91
ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజ్	24,739	4,101.97
వైఎస్సార్ సున్నా వడ్డీ (అర్బన్)	66,600	39.02
వైఎస్సార్ ఆసరా(అర్బన్)	46,378	141.41
వైఎస్సార్ బీమా	723	40.86
ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజ్ (అర్బన్)	35,900	1200.23
జగనన్న అమ్మ ఒడి	1,66,398	946.49
వైఎస్సార్ చేయూత(అర్బన్)	20,982	104.57
పేదలందరికీ ఇళ్లు	64,029	370.32

చంద్రబాబు మహిళలకిచ్చిన హామీల్లో కొన్ని...

- ఆడబిడ్డ నిధి పేరుతో 18 ఏళ్లు నిండి 59 ఏళ్లలోపు ఉన్న ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఏటా రూ.18 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం.
- 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున అందజేస్తాం.
- మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తాం.
- ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం.
- డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇస్తాం.
- మహిళలకు నీళ్ల మోసే బాధ తప్పించేందుకు ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇప్పిస్తాం.
- ఉద్యోగాలు చేసే మహిళలకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తాం.
- 'కలలకు రెక్కలు' పథకం ద్వారా విద్యార్థినులకు రుణాలు ఇప్పిస్తాం
- పండుగ కానుకలు, పెళ్లి కానుకలు పునరుద్ధరిస్తాం.
- ప్రత్యేక పథకం ద్వారా పీ4 మోడల్‌లో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం..

... ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఎన్నో అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని మహిళలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆయన మాటలు నమ్మి మోసపోయామని వారంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల కోసం ప్రవేశపెట్టిన 'జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ బీమా ఇలా ప్రతి పథకాన్నీ వారు గుర్తు చేసుకుంటూ 'బాబు కన్నా జగనే బెటర్..' అని బేరీజు వేసుకుంటున్నారు.

హామీలను మాఫీ చేశారు



డ్వాక్రా రుణాల మాఫీ, రైతుల రుణాల మాఫీ అని గతంలో చంద్రబాబు చెప్పి ఏకంగా ఆ హామీలన్నింటినీ మాఫీ చేశారు. ఇప్పుడు కూడా అంతే. చంద్రబాబు మాటలు నమ్మి మహిళలంతా ఆయనకు ఓట్లేసి మరోసారి మోసపోయారు. ఎన్నికల సమయంలో మహిళలు కనబడగానే నీకు 18 వేలు.. నీకు 18 వేలు అన్నారు... ఇప్పుడు దాని గురించి మాట్లాడేవారే లేరు. ఇచ్చిన మాట మీద నిలబడటం జగనన్నకే సాధ్యం.

– విజయలక్ష్మి, బూదిదగడ్డపల్లి, గోరంట్ల మండలం

మోసం.. ఆయన నైజం



ప్రజల్ని మోసగించడంలో చంద్రబాబును మించిన వారు లేరు. మోసం చేయడం ఆయన నైజం. సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చానంటున్నారు. మరి ఆడబిడ్డ నిధి ఏదీ? ఇంకా చాలా హామీలున్నాయి. ప్రజల తరఫున హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. అవసరమైతే ప్రజల పక్షాన పోరాటాలకు కూడా సిద్ధమవుతాం.

– ఉషశ్రీ చరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

రామగిరిలో రాక్షస రాజ్యం

- తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై మరో కేసు నమోదు
- పరిటాల సునీత డైరెక్షన్‌లో పోలీసుల యాక్షన్
- దాడిలో నిందితులను వదిలి బాధితులపైనే కేసులా?



సాక్షి, పుట్టపర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పక్కన బెట్టి.. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అనే విష సంస్కృతిని అమలు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా పోలీసులతో కేసులు నమోదు చేయిస్తూ.. ఇబ్బందులకు గురి చేస్తోంది. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో రెడ్ బుక్ రాజ్యాంగం పక్కాగా అమలవుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎవరికి నష్టం జరిగినా.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా కేసులు పెడుతున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలకు వెళ్లేందుకు ప్రయత్నించినా దాడులు చేస్తున్నారు. బాధితులకు.. అండగా నిలిచే వారిపై కేసులు బనాయిస్తున్నారు. 'టీడీపీలో చేరాలి.. లేదంటే మౌనంగా ఉండాలి. కాదు, కూడదంటే కేసుల్లో ఇరుక్కుని.. గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుంది' అంటూ టీడీపీ కార్యకర్తలు హెచ్చరికలు జారీ చేస్తుండటం గమనార్హం. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ కనుసన్నల్లోనే పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

రామగిరిలో బీభత్సం..

రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక కోసం అనెక్జర్లు ఇచ్చేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై ఎంపీడీఓ కార్యాలయం వద్ద టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారు. పైగా దాడులు చేసిన వారిని వదిలేసి.. బాధితులపై కేసులు నమోదు చేయడం రెడ్ బుక్ రాజ్యాంగానికి నిదర్శనం.

ఎంపీపీ ఎన్నికల్లో..

ఎంపీటీసీ సభ్యురాలిని కిడ్నాప్ చేస్తుండగా.. అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. కిడ్నాప్ యత్నం చేసిన ఏ ఒక్క టీడీపీ కార్యకర్తపైనా కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

హెలిప్యాడ్ ఘటనలో..

పాపిరెడ్డిపల్లిలో టీడీపీ గూండాల చేతిలో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్ వచ్చిన సమయంలో పోలీసుల భద్రతా వైఫల్యంతో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ పోయింది. ఈ ఘటనలో సుమారు 200 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు.

ఏడుగుర్రాలపల్లి ఘటనలో..

పేరూరు పంచాయతీ ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో టీడీపీ కార్యకర్తలు నిందితులుగా ఉండటంతో కొన్ని నెలల పాటు విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

పేరూరు పర్యటనలో..

ఏడుగుర్రాపల్లిలో దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ 'చలో పేరూరు' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే పోలీసులు అనుమతులు నిరాకరించారు. అంతేకాకుండా పేరూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల వాహనాలను ధ్వంసం చేశారు. దాడులకు తెగబడిన వారిని వదిలేసి.. బాధితులపైనే కేసులు నమోదు చేశారు.

పరిటాల సునీత కనుసన్నల్లోనే..



రామగిరి మండలంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ పని చేస్తోందనే అనుమానం కలుగుతోంది. నిందితులను వదిలి బాధితులపై కేసులు నమోదు చేస్తుండటమే నిదర్శనంగా చెప్పవచ్చు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రామగిరిలో తిరగలేని పరిస్థితి. ఏ విషయంలో రోడ్డెక్కినా కేసులు మోసుకోవాల్సిందేనా? సమస్యలు బయటికి చెప్పుకునేందుకు చాలామంది భయపడుతున్నారు. టీడీపీ రౌడీలు దాడులకు తెగబడి.. ఆ సమయంలో ఇళ్లలో ఉన్న వారిపై కూడా కేసులు నమోదు చేస్తుండటం 'పరిటాల' దుర్మార్గపు పాలనకు నిదర్శనం.

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు

టీచర్ల బదిలీలు @ 7,152

- అనుకూలమైన చోటుకు 'స్పౌజ్ బదిలీలు'
- కమిషనర్ ఆదేశాలు తుంగలోకి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో మొత్తం 7,152 మంది ఉపాధ్యాయులు బదిలీలయ్యారు. వీరిలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 133 మంది, పీఎస్‌హెచ్‌ఎంలు 193 మంది, స్కూల్ అసిస్టెంట్లు 3,478 మంది, ఎస్జీటీలు 3,208 మంది పండిట్లు 111 మంది, పీఈటీలు 29 మంది ఉన్నారు. తప్పనిసరి బదిలీలతో ఏర్పడి ఖాళీలు, రీఆపోర్సన్ ద్వారా ఏర్పడిన ఖాళీలు, ఫారెన్ సర్వీస్‌కు వెళ్లడంతో ఏర్పడిన ఖాళీలు, బాలికల పాఠశాలల్లో పురుష టీచర్లు పని చేస్తున్న ఖాళీలు, వివిధ డిగ్రీలు చేసేందుకు సెలవులో వెళ్లిన టీచర్ల స్థానాల్లో ఏర్పడిన ఖాళీలు, అనధికార గైర్హాజరుతో ఏర్పడిన ఖాళీలన్నీ భర్తీ చేశారు.

బదిలీ అయిన టీచర్లు సబ్జెక్టుల వారీగా...

లాంగ్వేజ్ పండిట్ హిందీ 14 మంది, కన్నడ 1, తెలుగు 87, ఉర్దూ 9 మంది బదిలీ అయ్యారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ తెలుగు 29 మంది, పీఎస్‌హెచ్‌ఎం కన్నడ 1, తెలుగు 191, ఉర్దూ 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 511, హిందీ 238, కన్నడ 1, సంస్కృతం 7, తెలుగు 386, ఉర్దూ 16, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ తెలుగు 510, ఉర్దూ 6, కన్నడ 2, స్కూల్ అసిస్టెంట్ గణితం తెలుగు 647, ఉర్దూ 10, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) తెలుగు 188, ఫిజికల్ సైన్స్ తెలుగు 518, ఉర్దూ 6, సోషల్ తెలుగు 415, ఉర్దూ 3, స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగు 14, ఎస్జీటీ తెలుగు 3,142, ఉర్దూ 54, కన్నడ 12 మంది టీచర్లు బదిలీ అయ్యారు.

కమిషనర్ ఆదేశాలు తుంగలోకి..

స్పౌజ్ బదిలీల అంశంలో తొలినుంచి వివాదాస్పదమవుతున్నా... కమిషనర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తున్నామంటూ చెప్పిన అధికారులు, ఉద్యోగులు కొందరి విషయంలో 'అయిన వారికి ఆకులో కానివారికి కంచంలో' అన్న చందంగా వ్యవహరించారు. కొందరినైతే స్పౌజ్ పని చేస్తున్న పాఠశాలలో ఖాళీగా ఉంటే భాగస్వామిని కూడా అక్కడికే పంపారు. పుట్లూరు మండలం కడవకల్లులో గణితం టీచరు పీఎస్‌హెచ్‌ఎంగా పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నెకు వెళ్లారు. ఈయన స్పౌజ్ సర్టిఫికెట్ కడవకల్లులో పని చేస్తున్నదే ఇచ్చారు. ఆ ప్రకారం గణితం టీచరుగా ఉన్న ఆయన భార్య పుట్లూరు మండలానికి వెళ్లాలి. లేదా బదిలీ అయిన పెద్దపప్పూరు మండలానికి వెళ్లాలి. ఈ రెండుకాదని మండల కేంద్రం ఆత్మకూరుకు పంపారు. గార్లదిన్నె మండలంలో పని చేస్తున్న ఓ టీచరు భార్య కూడా నిబంధనలకు విరుద్ధంగా నార్పల మండలానికి వెళ్లారు.

584 మందికి పదోన్నతులు..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 584 మంది వివిధ కేడర్ల టీచర్లకు పదోన్నతులు కల్పించారు. వీరిలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 153 మంది, మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎంలుగా కన్నడ 1, తెలుగు 130, ఉర్దూ 10 ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 46, హిందీ 1, తెలుగు 1, ఉర్దూ 1, గణితం (తెలుగు) 81, గణితం (ఉర్దూ) 5, పీఎస్ తెలుగు 46, పీఎస్ (ఉర్దూ) 1, పీఎస్ (కన్నడ) 01, బీఎస్ (తెలుగు) 39, బీఎస్ (ఉర్దూ) 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) తెలుగు 6, సోషల్ (తెలుగు) 50, సోషల్ (ఉర్దూ) 06, సోషల్ (కన్నడ) ఇద్దరికి పదోన్నతులు కల్పించారు.

మేమేం పాపం చేశాం?

- చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం
- చిరుద్యోగులపై కనికరమే లేదా..?
- సంక్షేమ పథకాలు అమలు చేయండి
- గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు చిరుద్యోగుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతున్న మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికులు

పుట్టపర్తి : వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న చిరుద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్, ఇంజినీరింగ్ పారిశుద్ధ్య కార్మికులను కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటించింది. చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్న తాము ఏం పాపం చేశామని పథకాలు కట్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తల్లికి వందనం కింద వచ్చే డబ్బుతో పిల్లల చదువులకు వినియోగించవచ్చన్న ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ, పుడా పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు పథకాలు రాకుండా చేస్తే పిల్లల చదువులకు కష్టమైపోతుందని తెలిపారు. చిరుద్యోగులం.. అల్పజీవులం.. మా కష్టాలను అర్థం చేసుకుని సంక్షేమ పథకాల వర్తింపులో మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు పైపల్లి గంగాధర్, బాబావలి, మున్సిపల్ యూనియన్ నాయకులు నాగార్జున, రామయ్య, గోవింద్, కార్మికులు వెంకటేష్, లక్ష్మయ్య, సాయమ్మ, నారాయణ, నరసింహులు, సరోజమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూమి పెంచి.. అర్హత తుంచి..



'తల్లికి వందనం' అందలేదని తెలుపుతున్న బాధితులు

తాడిమర్రి: అర్హత ఉన్నా తమకు తల్లికి వందనం పథకం వర్తించలేదని తాడిమర్రి మండల కేంద్రంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం సచివాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.రామచంద్ర, దాసరి లక్ష్మీనారాయణ, పార్నపల్లి కన్నప్ప, ఎం.శ్రీనివాసులు, సాకే పోతలయ్య, చందమామ గంగాధర్, చందమామ మునిప్రసాద్ తదితర విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా వివరాలు నమోదు చేసి పథకం రాకుండా ఎలా చేస్తారంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక సాకు చూపి అనర్హులుగా చూపడానికి ప్రయత్నం చేస్తున్నారంటూ మండిపడ్డారు. తమకు ఉన్నదాని కన్నా ఎక్కువ భూమి చూపి అనర్హుల జాబితాలో చేర్చారన్నారు. ఒకరికి అయితే ఏకంగా 327.17 ఎకరాల భూమి ఉన్నట్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదైందని, ఇలాంటి బాధితులు వందల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. తప్పులను సవరించి అర్హులందరికీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

డీఐపీఆర్ఓగా బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ చేతన్ కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణుగోపాలరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారిగా (డీపీఆర్ఓ)గా వేణుగోపాలరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు. అలాగే పీఆర్ఓగా మస్తాన్ సాహెబ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి డీపీఆర్ఓ సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు మంజునాథ్

ధర్మవరం అర్బన్: విద్యుత్‌షాక్‌కు గురై ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డికాలనీలో నివాసముంటున్న మంజునాథ్ (32)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో భార్య మూడో కాన్పు కోసం ఇటీవల పుట్టింటికి వెళ్లింది. కేశవనగర్‌లో సోమవారం ఓ భవన నిర్మాణ పనుల్లో పాలుపంచుకున్న మంజునాథ్... పని ప్రాంతంలో ఇనుపకడ్డీ ఎత్తుతున్న సమయంలో భవనానికి ఆనుకుని ఉన్న విద్యుత్ లైన్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సెంట్రల్‌లో సరికొత్త కోర్సులు

- ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా 15 డిప్లొమా కోర్సులు
- ఇప్పటికే ముగిసిన సీయూ సెట్
- మిగులు సీట్ల భర్తీకి మరో అవకాశం
- జూలై చివరి వరకూ ప్రవేశాలకు గడువు
- యూజీలో 9, పీజీలో 17 కోర్సులు అందుబాటులోకి
- ఆరు విభిన్న కోర్సుల్లో పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం



సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

అనంతపురం: నాణ్యమైన ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా నిలిచిన అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో సరికొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ప్రవేశ పరీక్ష ద్వారా దేశ వ్యాప్తంగా 14 సెంట్రల్ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందే అవకాశముంది. ఇప్పటికే సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రెస్ టెస్ట్ (సీయూ సెట్)కు గడువు ముగిసింది. అయితే సీయూ సెట్ ద్వారా సీట్లు భర్తీ కాగా, మిగులు సీట్ల భర్తీని వర్సిటీనే స్వతహాగా ఓ ప్రవేశ పరీక్ష నిర్వహించి చేపడుతుంది.

క్యాంపస్ కళాశాలలో డిగ్రీ కోర్సులు..

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో 9 యూజీ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. బీఏ ఆనర్స్ కింద పొలిటికల్ సైన్సెస్ విభాగంలో 40 సీట్లు, ఇంగ్లిష్ విభాగంలో 25, బీబీఏలో 60, బీకాం ఆనర్స్‌లో 40, బీఎస్సీ ఆనర్స్ కింద ఎకనామిక్స్ విభాగంలో 25, ఆర్ఎంబీటీలో 25, సైకాలజీలో 30, సీఎస్ అండ్ ఏఐలో 60, బీటెక్ (సీఎస్ఈ)లో 60 సీట్లు భర్తీ చేస్తారు. ఇక పీజీలో ఎంఏలో ఇంగ్లిష్ విభాగానికి 30 సీట్లు, హిందీ విభాగానికి 20, గవర్నెన్స్ అండ్ పబ్లిక్ పాలసీలో 20, పొలిటికల్ సైన్సెస్‌లో 30, తెలుగులో 20 సీట్లు కేటాయించారు. అలాగే ఎంబీఏకు 60, ఎంకాంలో 20, ఎమ్మెస్సీలో అప్లైడ్ సైకాలజీ విభాగంలో 40, ఏఐ అండ్ డీఎస్‌లో 40, క్లినికల్ సైకాలజీ విభాగంలో 25, కంప్యూటేషనల్ సోషల్ సైన్స్‌లో 20, ఎకనామిక్స్‌లో 20, ఎకనామిక్స్ అండ్ డేటా అనాలసిస్‌లో 20, జియాగ్రఫీలో 25, మేథమేటిక్స్‌లో 30, మాలుక్యులార్ బయాలజీలో 30, స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీట్లు అందుబాటులో ఉంటాయి. పీహెచ్‌డీకి సంబంధించి పొలిటికల్ సైన్సెస్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ కోర్సు, తెలుగు, ఇంగ్లిష్, సైకాలజీ కోర్సులు ఉన్నాయి. పీహెచ్‌డీని ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసే సౌలభ్యం కూడా ఉంది.

గతేడాది 23 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు..

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా 2018లో అనంతపురం కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కాగా, ప్రస్తుతం బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద 491 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో శాశ్వత క్యాంపస్‌ను నెలకొల్పారు. రెండు అకడమిక్ బ్లాక్‌లు, ఒక అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, రెండు బాయ్స్, ఒక గర్ల్స్ హాస్టళ్లు అందుబాటులో ఉన్నాయి. ఓ ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్, మరో సోలార్ పార్క్‌తో ఆరు జోన్లలో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటైంది. ప్రస్తుతం 2,400 మంది విద్యార్థులు చదువుతున్నారు. పది రాష్ట్రాలు.. ఒక కేంద్ర పాలిత ప్రాంతం నుంచి వచ్చిన ప్రొఫెసర్లు ఇక్కడ పనిచేస్తున్నారు. 75 మంది ప్రొఫెసర్లలో 50 శాతం మంది మహిళలే ఉండడం విశేషం. గతేడాది 23 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. యూపీఎస్సీ ఉచిత కోచింగ్ ప్రోగ్రాం కూడా నిర్వహిస్తుండడంతో ఇక్కడి సెంట్రల్ యూనివర్సిటీలో చేరేందుకు పలువురు విద్యార్థులు పోటీ పడుతుంటారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో భాగంగా ఇప్పటికే ఇక్కడ చదువుకున్న 160 మంది విద్యార్థులకు పలు కంపెనీల్లో కొలువులు దక్కాయి.

కొత్తగా డిప్లొమా కోర్సులు..

సెంట్రల్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా 15 డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏడాది కాల వ్యవధి ఉన్న డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

డిప్లొమా కోర్సుల వివరాలు..

- కంప్యూటేషనల్ సోషల్ సైన్సెస్
- జియో– స్పేషియల్ ఇన్ఫర్మేటిక్స్
- బయో ఇన్ఫర్మెటిక్స్ అండ్ డేటా సైన్సెస్
- పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ స్టడీస్
- డిజిటల్ మార్కెటింగ్
- కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ (ట్యాలీ ఈఆర్‌పీ) విత్ జీఎస్టీ ఫైలింగ్
- సైబర్ సెక్యూరిటీ
- గ్రీన్ ఎనర్జీ అండ్ మేనేజ్‌మెంట్
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్
- బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్
- మేథమేటికల్ ఫౌండేషన్స్ ఫర్ మెషిన్ లర్నింగ్ అండ్ డేటా సైన్సెస్
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్
- సెమీ– కండక్టింగ్ టెక్నాలజీ
- క్వాంటమ్ కంప్యూటింగ్ అండ్ మెషిన్ లర్నింగ్
- డిజైన్ థింకింగ్

సరికొత్త కోర్సులకు రూపకల్పన



సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా సరికొత్త కోర్సులకు రూపకల్పన చేశాం. డిప్లొమాలో 15 కోర్సులు అందుబాటులోకి తెచ్చాం. యూజీలోనూ బీటెక్, ఏఐ కోర్సులు ఉన్నాయి. పీజీలోనూ సరికొత్త కోర్సులు తీసుకొచ్చాం. గతేడాది 23 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఈ విద్యా సంవత్సరంలోనూ అదే ఒరవడి కనిపిస్తోంది. – ఎస్.ఎ.కోరి, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

'పోలీసు స్పందన'కు 80 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 80 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ కుమార్, మహిళా డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజరీ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

మద్యం కేసులో ఇద్దరికి జైలు

సోమందేపల్లి: కర్ణాటక మద్యం విక్రయించిన కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష పడింది. 2022లో పత్తికుంటపల్లిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఆంజనేయులు, ఓబులేస్‌పై సోమందేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పెనుకొండ కోర్టులో కేసు విచారణ జరిగింది. సోమవారం తుది విచారణ అనంతరం మద్యం విక్రేతలిద్దరికీ ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి బొజ్జప్ప తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

నగదు వసూళ్లకు పాల్పడిన వారిపై కేసు నమోదు

కదిరి టౌన్: పోలీసుల పేరు చెప్పి ప్రజలను బెదిరించి బలవంతంగా నగదు వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. కదిరిలోని ఇందిరా గాంధీ వీధిలో నివాసముంటున్న తమిళనాడులోని అర్నామికి చెందిన మారుదముత్తు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అనంతపురం సంతలో కొనుగోలు చేసిన పశువులను రెండు కంటైనర్లలో కదిరి మీదుగా తరలిస్తుండగా కుటాగుళ్లకు చెందిన పొట్టిండ్ల నాగభూషణ, బుక్యా ఆంజనేయులు నాయక్, కదిరికి చెందిన కుళ్లాయప్ప బొలెరో వాహనంలో వెంబడించి ఆటకాయించారు. తాము పోలీసులమంటూ బెదిరించి రూ.20 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.6 వేలు తీసుకకుని వదిలేశారు. ఘటనకు సంబంధించి మారుదముత్తు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం నిందితులపై కేసు నమోదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

కదిరి టౌన్: స్థానిక వలీసాహెబ్ రోడ్డులో నివాసముంటున్న వివాహిత నాగేశ్వరి ఫిర్యాదు మేరకు ఆమె భర్త ప్రహ్లాదశెట్టిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. 14 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. టిఫెన్ బండితో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా భర్త వేధింపులకు పాల్పడుతూ వచ్చేవాడు. ఆదివారం దుర్భాషలాడుతూ కొట్టడంతో మనస్తాపం చెందిన ఆమె అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అదే సమయంలో ఇంటికి చేరుకున్న తల్లి, తమ్ముడు ఆమెను కాపాడారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రహ్లాదశెట్టిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగేందుకు డబ్బివ్వలేదని ఆత్మహత్య



గోపాల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసు

ధర్మవరం అర్బన్: మద్యం తాగేందుకు డబ్బివ్వలేదని ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ధర్మవరంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్‌కాలనీకి చెందిన గుండు గోపాల్(57) తాగుడుకు బానిసయ్యాడు. అతని భార్య ప్రస్తుతం గర్భిణి కావడంతో కాన్పు ఖర్చుల కోసం రూ.10 వేలు దాచుకున్నారు. ఆ డబ్బు కావాలని భార్య, తల్లితో గోపాల్ గొడవ పడ్డాడు. వారు ఇవ్వకపోవడంతో క్షణికావేశానికి లోనయ్యాడు. కాలనీకి సమీపంలోని రైల్వే ట్రాక్ పైకి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఏటా జేష్ఠ్య మాసంలో స్వామివారికి నిత్య కల్యాణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెలలో శనివారం పర్వదినాలు తప్ప మిగతా రోజుల్లో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహిస్తున్నారు. సోమవారం అర్చకులు కుమార్‌స్వామి శ్రీరంగ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. స్వామివారికి పెళ్లి కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక నుంచి భక్తులు పాల్గొన్నారు.


సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత నెల్లూరు



విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న ఏడీసీఏ జిల్లా సెక్రటరీ భీమలింగారెడ్డి

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియం వేదికగా నిర్వహించిన సౌత్ జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నీ విజేతగా నెల్లూరు జట్టు నిలిచింది. సోమవారం అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌ను ఎంచుకున్న అనంతపురం జట్టు 48.5 ఓవర్లలో 295 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో మచ్చా దత్తారెడ్డి 58 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 43, మహేందర్‌రెడ్డి 58, రాజకుళ్లాయప్ప 44 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ బరిలో దిగిన నెల్లూరు జట్టు 9 వికెట్ల నష్టానికి 49.4 ఓవర్లలో 296 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో రేవంత్‌రెడ్డి 104 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్సర్‌తో 88 పరుగులు సాధించాడు. పాయింట్ల టేబుల్‌లో 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన నెల్లూరు జట్టును విజేతగా ప్రకటిస్తూ ట్రోఫీని ఏడీసీఏ సెక్రటరీ వి.భీమలింగారెడ్డి అందజేశారు.

బైక్‌ను అడ్డుకుని చైన్‌స్నాచింగ్



బాధితురాలు అనిత

రొళ్ల: ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళను అడ్డుకుని ఆమె మెడలోని బంగారు నగను అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితురాలు తెలిపిన మేరకు.. రొళ్ల మండలం హెచ్‌టీ హళ్లి గ్రామానికి చెందిన సిద్దప్ప భార్య అనిత యానిమేటర్‌గా చేస్తున్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో పని ఉండడంతో స్వగ్రామం నుంచి రొళ్లకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మల్లినమడుగు పంచాయతీ కేంద్రం దాటిన తర్వాత ప్రధాన రహదారిపై గుడిబండ వైపు నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర ఓ ఆగంతకుడు ద్విచక్రవాహనంపై ఆమెను అనుసరిస్తూ హెచ్‌ఎం పల్లి సమీపంలోని బైలాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకోగానే నిర్జన ప్రదేశంలో అడ్డుకున్నాడు. ఆమె మెడలోని 35 గ్రాముల బంగారు మాంగల్యం చైన్‌ను లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రొళ్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి దుర్మరణం



శ్రీహరినాయుడు (ఫైల్)

గాండ్లపెంట: ఎద్దుల బండి ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు పోలీసులు తెలిపిన మేరకు... ఎన్‌పీకుంట మండలం ముక్కంవాండ్ల పల్లికి చెందిన శ్రీహరినాయుడు(35)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సోమవారం శ్రీహరినాయుడు దంపతులు గాండ్లపెంట మండలం రెక్కమానుకు ద్విచక్ర వాహనంపై ప్రయాణమయ్యారు. పెడకంటివారిపల్లి వద్దకు చేరుకోగానే రోడ్డు సమీపంలోని పొలం నుంచి గాజులవాండ్లపల్లికి చెందిన రైతు ఎం.కృష్ణానాయక్‌కు చెందిన ఎద్దుల బండి ప్రధాన రహదారిపైకి ఒక్కసారిగా దూసుకొచ్చింది. అప్పటికే అత్యంత సమీపంలోకి చేరుకున్న శ్రీహరినాయుడు బ్రేక్‌లు వేసినా ఫలితం లేకపోవడంతో ఎద్దుల బండిని ఢీకొన్నాడు. ఘటనలో తీవ్ర గాయాలతో శ్రీహరినాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన భార్య సింధూజను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎన్‌పీకుంట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ తరలింపు అడ్డగింత



ఇసుక లారీకి అడ్డుగా రోడ్డుపై బైఠాయించిన మొద్దన్న

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లి వైపు నుంచి లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మొద్దన్న రోడ్డుపై బైఠాయించి అడ్డుకున్నారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రొద్దం మండలం పెద్దమంతూరు వద్ద పెన్నానది నుంచి కొన్ని రోజులుగా లారీల్లో కొందరు టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు తమ గ్రామ సమీపంలోని ఇసుకను ఎలా తరలిస్తారంటూ మొద్దన్న ఆందోళనకు దిగాడు. ఫలితంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడకు చేరుకుని మొద్దన్నను బలవంతంగా పక్కకు ఈడ్చి పడేశారు. దీంతో ఇసుక లారీ పెనుకొండ వైపుగా వెళ్లిపోయింది.

టీచర్ కిడ్నాప్ కేసులో వీడిన మిస్టరీ

- పథకం ప్రకారం కిడ్నాప్ చేసిన కుటుంబ సభ్యులు
- 11 మంది నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: మూడు రోజుల క్రితం కిడ్నాప్‌నకు గురైన ఉపాధ్యాయురాలి కేసులో మిస్టరీ వీడింది. కుటుంబసభ్యులే పథకం ప్రకారం ఆమెను కిడ్నాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించి, నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం కళ్యాణదుర్గం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ రవిబాబు, సీఐ నీలకంఠేశ్వర్ వెల్లడించారు. బెళుగుప్ప మండలం తగ్గుపర్తి గ్రామానికి చెందిన మారుతమ్మ... కంబదూరు మండలం కూరకులపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మారుతమ్మకు పెళ్లి చేస్తే కుటుంబ పోషణ భారమవుతుందని భావించిన కుటుంబ సభ్యులు వచ్చిన సంబంధాలను పథకం ప్రకారం చెడగొడుతూ వచ్చేవారు. ఈ క్రమంలో తన స్వగ్రామానికి చెందిన ఎర్రిస్వామితో అయిన పరిచయం కాస్త ప్రేమకు దారి తీయడంతో ఇటీవల ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఇది గిట్టని కుటుంబసభ్యులు ఎలాగైనా ఇద్దరినీ విడగొట్టాలని భావించారు. ఇందులో భాగంగా ఈ నెల 12న విధులు ముగించుకుని భర్తతో కలసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బొలెరో వాహనంలో వచ్చిన 11 మంది కుటుంబసభ్యులు అటకాయించి మారుతమ్మను బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని వెళ్లిపోయారు. విషయాన్ని వెంటనే ఎర్రిస్వామి కంబదూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

ఆస్తి కోసం మట్టుబెట్టే ప్రయత్నం

అనంతపురంలో విలువైన స్థలం మారుతమ్మ పేరుపై ఉంది. అలాగే బంగారు నగలు కూడా పెద్ద మొత్తంలో ఉన్నాయి. తమను కాదని ఆమె ఎర్రిస్వామిని పెళ్లి చేసుకోవడంతో ఆస్తితో పాటు ఆమె సంపాదన మొత్తం అతనే అనుభవిస్తాడనే అక్కసు మారుతమ్మ కుటుంబసభ్యుల్లో నెలకొంది. దీంతో మారుతమ్మను పథకం ప్రకారం కిడ్నాప్ చేసి బెంగళూరులోని బంధువు ఇంటికి తరలించారు. ఆస్తితో పాటు బంగారు నగలు స్వాధీనం చేయాలంటూ చిత్రహింసలకు గురి చేశారు. ఎర్రిస్వామిని వదిలేసి వివాహితుడైన తమ బంధువులోని ఓ అబ్బాయిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశారు. అయితే మారుతమ్మ తలొగ్గకపోవడంతో చివరకు హతమార్చాలని తల్లిదండ్రులు భావించారు. విషయం తెలుసుకున్న మారుతమ్మ చాకచక్యంగా వ్యవహరించారు. 'మీరు చెప్పినట్లుగానే నడుచుకుంటా'నంటూ నమ్మబలికారు. దీంతో ఆదివారం బెంగళూరు నుంచి స్వగ్రామానికి బొలెరో వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం కళ్యాణదుర్గం శివారులోకి చేరుకోగానే అప్పటికే అక్కడ వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు బొలెరోను అటకాయించి పరిశీలించారు. అందులో మారణాయుధం లభ్యం కావడంతో అనుమానంతో పీఎస్‌కు తరలించి, విచారణ చేపట్టారు. అదే సమయంలో మారుతమ్మ తనపై కుటుంబసభ్యులు సాగించిన కుట్రలు వివరించడంతో విషయం కాస్త బయటపడింది. మారుతమ్మ ఫిర్యాదు మేరకు ఆమె కుటుంబసభ్యులైన ఆనంద్, శ్యామలమ్మ, విశాఖ, ఎల్లప్ప, మహాలక్ష్మి, అంకాలప్ప, మహేష్, రమేష్, వన్నూరుస్వామి, మహేంద్ర, బాబుపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



యోగాంధ్రలో పాల్గొన్న మంత్రి సవిత, కలెక్టర్ చేతన్

పెనుకొండ రూరల్: యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగా భాగం కావాలని సూచించారు. సోమవారం ఉదయం పెనుకొండ శివారులోని కియా పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేసిన, యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ చేతన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ యోగాతో మానసికోల్లాసం, ఏకాగ్రత కలుగుతుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. సీఈఓ కబ్బాంగ్ లీ, ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు,కియా ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.